క్లుప్తంగా

భైరవస్వామికి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి గ్రామంలో కొలువుదీరిన కాలభైరవస్వామికి ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కాశీకామాత, కాళభైరవస్వామికి హారతి నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ ఆదివారం కాళభైరవస్వామి పూజలు చేసేందుకు చెన్నూర్, కోటపల్లి నుంచే కాకుండా మంచిర్యాల, గోదావరిఖని నుంచి భక్తులు తరలిరావడం విశేషం.

'ముమ్మాటికి రాజకీయ హత్యే'

వేమనపల్లి: బీజేపీ మండల అధ్యక్షుడు ఏటా మధుకర్‌ది ఆత్మహత్య కాదు.. రాజకీయ హత్యేనని బీఆర్‌ఎస్ నాయకులు దుయ్యబట్టారు. వేమనపల్లి ఏఎంసీ చైర్మన్ కుబిడే వెంకటేశ్, సీనియర్ బీఆర్‌ఎస్ నాయకుడు పురాణం లక్ష్మీకాంత్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మధుకర్ ఆత్మహత్యకు కారకులైన కాంగ్రెస్ నాయకులను ఎమ్మెల్యే వినోద్ పార్టీ నుంచి సస్పెండ్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ నాయకులను పల్లెల్లో తిరగకుండా అడ్డుకుంటామన్నారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేస్తామన్నారు.

సరిహద్దు రాళ్లు ఏర్పాటు

భీమారం: మండల కేంద్రంలోని శ్రీకోదండ రామాలయం భూమిలో ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ కొత్తపోటు రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో హద్దురాళ్లు వేశారు. 40సంవత్సరాల క్రితం నిర్మించిన రామాలయానికి గల భూముల్లో రెండు నెలల క్రితం రెవెన్యూ శాఖ ద్వారా సర్వే చేశారు. ఈ మేరకు ఆలయంలో జరిగిన కమిటీ సమావేశంలో మొదటి పనిగా ఆలయం భూముల్లో సరిహద్దు రాళ్లువేయడంతోపాటు కమిటీ పేరుతో బ్యాంకు ఖాతా తెరిచి దాతల నుంచి విరాళాలు సేకరించాలని నిర్ణయించారు. ఇందులో వైస్ చైర్మన్లు దుర్గం రాజు, పున్నంగౌడ్, మార్నేని లక్ష్మణ్, మైండె మల్లేశ్, ప్రధాన రార్యదర్శి బండి శ్రీరాములు పాల్గొన్నారు.

శ్రీరాంరావ్ వర్ధంతి

జన్నారం: మండలకేంద్రంలో సంత్ శ్రీ రాంరావ్ వర్ధంతిని లంబాడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని లంబాడ గిరిజనులు పోలీస్‌స్టేషన్ సమీపంలోని రాంరావ్ విగ్రహం వద్దకు వెళ్లి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రాములునాయక్, బద్రినాయక్, ప్రకాశ్‌నాయక్, సుధన్‌లాల్, సాయికుమార్ నాయక్, ధర్మునాయక్ పాల్గొన్నారు.

కంటి శస్త్రచికిత్స నిర్ధారణ వైద్య శిబిరం

పాతమంచిర్యాల: ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 14న జిల్లా కేంద్రంలోని లయన్స్‌క్లబ్‌లో మంచిర్యాల లయన్స్ క్లబ్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి శస్త్ర చికిత్స నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ డిస్ట్రిక్టు కో ఆర్డినేటర్ ఫర్ ఐ క్యాంప్స్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో కంటి శస్త్ర చికిత్స నిర్ధారణ వైద్య శిబిరం కరపత్రాలను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రామాంజనేయులు, సుగుణాకర్‌రెడ్డి, వియయ్‌కుమార్, డేగ బాపు, రామస్వామి పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

పాతమంచిర్యాల/మందమర్రిరూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ కుల సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పాతబస్టాండ్ కూడలి వద్ద గల ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహం ఎదుట ఆదివారం బీసీ కుల సంఘాల నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు పెద్దపల్లి సత్యనారాయణ, నాయకులు చిలగాని సుదర్శన్, వెంకటేశ్, ప్రతాప్, శ్రీనివాస్, బుచ్చయ్య, నరసింహులు, గురువయ్య, శంకర్, సత్తయ్య, రాజేష్, రవి తదుతరులు ఉన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద భక్త మార్కండేయ పద్మశాలీ స్వచ్ఛంద సేవా సంస్థ నాయకులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో భక్త మార్కండేయ పద్మశాలీ స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, నాయకులు అంజయ్య,అంకం సతీష్,జి.శ్రీనివాస్,చంద్రమౌళి,బిక్షపతి, రాజేశం తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు తవ్వారు.. బురద మిగిల్చారు

వేమనపల్లి: మండల కేంద్రంలోని పాత కల్మలపేట వైపు వెళ్లేదారి నీల్వాయి ప్రాజెక్ట్ ఎడమకాల్వ డిస్ట్రిబ్యూటరీ వద్ద బురద వల్ల వాహనదారులకు ఇబ్బందిగా మారింది. కాల్వ నిర్మాణ కోసం గత మే నెలలో కాంట్రాక్ట్ సిబ్బంది రోడ్డు తవ్వి, పైప్‌వేసి మట్టిపోయడంతో వర్షాలకు బురదమయం అవుతోంది. దీంతో వాహనదారులకు ఇబ్బంది తప్పడం లేదు.



మురుగు కాలువలు నిర్మించండి!

చెన్నూర్‌రూరల్/భీమారం: భీమారం మండల కేంద్రంగుండా వెళ్లే జాతీయరహదారి నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లే సీసీ రోడ్డుకు ఇరువైపులా, చెన్నూర్ మండలం సుందరసాలలోని ఎస్సీ కాలనీలో డ్రెయినేజీలు లేక వరదనీళ్లు రోడ్డుపైనే నిలుస్తున్నాయి. రోడ్డు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా, నేటికీ మురుగుకాలువలు నిర్మించలేదని ఆరోపిస్తున్నారు. డ్రెయినేజీలు నిర్మించాలని వేడుకుంటున్నారు.



పచ్చదనం.. ప్రమాదకరం

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుందరసాల గ్రామంలో రోడ్డు పక్కన, ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలంలో నీరు నిలిచి దానిపై పచ్చని పాకురు ఏర్పడింది. దీంతో దోమలు వృద్ధి చెంది చుట్టుపక్కల కాలనీ ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. అటుగా వెళ్లే వారికి ప్రమాదం కూడా పొంచి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

మక్క రైతుకు దిక్కెవరు?

- ఎడతెరిపి లేని వర్షాలతో రంగుమారిన మక్కలు
- మద్దతు ధరకు అమ్ముకోలేని పరిస్థితి
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు

ఇటీవల నిరంతరం కురిసిన వర్షాలు మక్క రైతులను నట్టేట ముంచేశాయి. చేతికొచ్చిన మొక్కజొన్న పంటను కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాలకు మొక్కజొన్న విత్తనాలు ముక్కిపోయి నల్లబారిపోయాయి. దీంతో వాటిని అమ్మడం గగనంగా మారింది. – జన్నారం



నల్లబడిన మక్కలను జాలి పడుతున్న రైతులు

మండలంలో వంద ఎకరాలు...

జన్నారం మండలంలో సుమారు వంద ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశారు. మండలంలోని కలమడుగు, తపాలపూర్, తిమ్మాపూర్, ధర్మారం, చింతగూడ, రాంపూర్ గ్రామాల్లో ఎక్కువమంది రైతులు మొక్కజొన్న పంట వేశారు. అడవిపందుల భారి నుంచి పశువుల భారి నుంచి పక్షుల భారీ నుంచి కాపాడుకున్నారు. 20రోజుల క్రితం మొక్కజొన్న పంట పూర్తిస్థాయిలో కోసి, మొక్కజొన్న కంకులను ఆరబెట్టుకున్నారు. కొన్ని గ్రామాల్లో మిషన్ ద్వారా మొక్కజొన్న విత్తనాలు కూడా తీసి ఆరబెట్టుకున్నారు. అదే సమయంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు పడటంతో పంట తడిసిపోయింది. పది రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు పడటంతో పంటను గదుల్లో పోసి ఉంచారు. దీంతో తేమకు మొక్కజొన్నలు నల్లబారి, ముక్కిపోయాయి. దూలి, నుషితో పురుగులు పట్టాయి.

పంటలు కాపాడుకోవడానికి నానా తంటాలు..

చేతికొచ్చిన మొక్కజొన్న పంటను కాపాడుకోవడం కోసం రైతులు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వాటిని ఎండలో ఆరబెట్టి, నుషి తొలగించే పనిలో పడ్డారు. ఇసుక పట్టే జాలిలో పోసి దూళిని తొలగిస్తున్నారు. తూర్పార పట్టి నల్లబారిన మొక్కజొన్నను తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. జన్నారం మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం లేకపోవడంతో వేరే ప్రాంతాలకు వెళ్లి అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి జన్నారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తే రైతులకు ఇబ్బంది తొలగిపోయే అవకాశం ఉంది.

అగ్గువకు అడుగుతున్నరు

నేను నాలుగెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాను. ఎకరానికి రూ.20వేల వరకు ఖర్చు చేశాను. పంట చేతికొచ్చాక వర్షాలు పడటంతో పంటను కాపాడుకునే ప్రయత్నం చేశాం. కానీ వర్షాలకు మొక్కజొన్నలు నల్లబారడంతో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. అమ్ముకుంటే పండించిన పంటకు గిట్టుబాటు వచ్చే అవకాశం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– పరమేశ్, రైతు, కలమడుగు

శుభ్రం చేసుకొని అమ్ముకోవాలి

మొక్కజొన్న పంట ముందుగానే కోశారు. కానీ వర్షాల కారణంగా నల్లబడే అవకాశం ఉంది. నల్లబడిన మొక్కజొన్న పంటను ఆరబెట్టి, శుభ్రం చేసుకోవాలి. కొనుగోలు కేంద్రం విషయంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

– సంగీత, ఏవో

నేడు గుండా మల్లేశ్ ఐదో వర్ధంతి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేశ్ ఐదో వర్ధంతిని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ నాయకులు ఏర్పాట్లు చేశారు. సింగరేణి సాధారణ కార్మికుడి కుటుంబంలో జన్మించిన ఆయన, సీపీఐ పక్షాన ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా మూడుసార్లు, బెల్లంపల్లి తొలి ఎమ్మెల్యేగా గుర్తింపు తెచ్చుకున్నారు. హెచ్ఎస్‌సీ వరకు చదువుకున్న మల్లేశ్ ఓ ప్రైవేట్ మోటారు ట్రాన్స్‌పోర్టులో లారీ క్లీనర్‌గా కొద్దికాలం పని చేశారు. ఈ సమయంలో సీపీఐ అనుబంధ సంఘం ఏఐవైఎఫ్‌లో చేరి క్రియాశీలంగా పనిచేసి కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితుడయ్యారు. సోమగూడెం గ్రూఫ్ ఆఫ్ మైన్స్‌లో సింగరేణి కార్మికుడిగా కొన్ని నెలలు పనిచేశారు. 1966లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు బాసెట్టి గంగారాం నేతృత్వంలో సీపీఐలో సాధారణ సభ్యుడిగా సభ్యత్వం తీసుకున్న మల్లేశ్ సింగరేణి ఉద్యోగానికి రాజీనామా చేసి సీపీఐ పార్టీలో పూర్తిస్థాయి కార్యకర్తగా పని చేశాడు. నిబద్ధతతో పనిచేసి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడి స్థాయికి ఎదిగారు. మల్లేశ్ తొలిసారిగా 1978లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత 1983లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రెండోసారి పోటీ చేసి విజయం సాధించారు. 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో కూడా గెలిచారు. 1994లో ఎన్నికల్లోనూ విజయం సాధించారు. 2009లో జరిగిన పునర్విభజనలో బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పడగా తొలి ఎమ్మెల్యేగా గెలిచి రికార్డు సృష్టించారు. సీపీఐ శాసన సభాపక్ష నాయకుడిగా కొనసాగారు.

ఇంటింటా బాకీ కార్డుల పంపిణీ

కాసిపేట: ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం పడిన బాకీ వెంటనే తీర్చాలని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య డిమాండ్ చేశారు. మండలంలోని దేవాపూర్‌లో ఆదివారం కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమురం భీం విగ్రహానికి నివాళులర్పించి ఎన్నికల హామీలు నెరవేర్చకుండా మోసం చేసిన తీరును ప్రజలకు వివరించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచకుండా మోసం చేసిందని, ప్రజలకు కాంగ్రెస్ పార్టీ బాకీ ఉన్న వివరాలతో కూడిన కార్డులను ఆదివారం పాతమంచిర్యాలలో మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య ఆధ్వర్యంలో ఇంటింటా పంపిణీ చేశారు.కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, మాజీ కౌన్సిలర్ పల్ల రాజన్న, వొడ్నాల రవీందర్, పెంట తిరుపతి, పెంట ప్రదీప్, రమేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



దేవాపూర్‌లో కుమురం భీం విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య నివాళులు

శ్రీరాంపూర్: బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌రావు ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లోని పలు కార్మిక వార్డుల్లో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ మోసాలను బాకీ కార్డు రూపంలో ఎండగట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటికీ కాంగ్రెస్ సర్కార్ బాకీ కార్డును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి మెరుగు పవన్‌కుమార్, మాజీ సర్పంచ్ గుంట జగ్గన్న, నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విజయదశమి

మంచిర్యాలటౌన్: రాష్ట్రీయ స్వయం సవక్ సంఘాన్ని 1925లో విజయదశమి రోజున ప్రారంభించగా, ఈ ఏడాది విజయదశమి నాటికి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీ కాలనీలో ఆదివారం విజయదశమి ఉత్సవాన్ని ఆర్‌ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశాన్ని కాపాడుకునేందుకు స్వామి వివేకానంద మాటలను ఆదర్శంగా తీసుకొని ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భావం చెందిందన్నారు. బీజేపీ, ఏబీవీపీ వంటి వాటిని ఏర్పాటు చేసి, హిందువులను సంఘటితం చేసే దిశగా పనిచేసిందని, మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడి, హిందూ సమాజ చైతన్యం కోసం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో వికాసతరంగిణి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు హనుమంతరావు, తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ మెంబర్, డాక్టర్ యెగ్గెన శ్రీనివాస్, విభాగ్ ప్రచార ప్రముఖ్ తడిగొప్పుల శంకరయ్య, ఉత్సవ ప్రముఖ్ వొడ్నాల లక్ష్మీనారాయణ, బస్తి ప్రముఖ్ మారుతి శరత్ కుమార్ పాల్గొన్నారు.



ఆర్‌ఎస్‌ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

'బీసీలకు అన్యాయం చేస్తున్న బీజేపీ'

- సీపీఎం జిల్లా కార్యదర్శి రవి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రవి

దండేపల్లి: బీసీ రిజర్వేషన్ బిల్లుకు ఆరు నెలలైనా చట్టబద్ధత కల్పించకుండా బీజేపీ అన్యాయం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి ఆరోపించారు. దండేపల్లిలో ఆదివారం సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి రవి హాజరై మాట్లాడారు. 2006అటవీ హక్కుల చట్టాన్ని అమలు పర్చడంలో బీజేపీ విఫలం అయ్యిందని, ఇక ప్రజల బాధలు పట్టించుకోకుండా కాంగ్రెస్ పార్టీ మాటలతో కడుపు నింపాలని చూ స్తుందని విమర్శించారు. ప్రజా పోరాటాలతో రెండు పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. హామీల అమలులో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని దు య్యబట్టారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానా లపై పోరాటాలకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పి లుపునిచ్చారు. దండేపల్లి మండల కార్యదర్శి కనిగరపు అశోక్, నాయకులు గంధం రాజలింగు, ఎర్రోజుల శ్రీనివాస్, మద్దికుంట రమేష్, దోసండ్ల ఎల్ల య్య, మహేశ్వరి, వెంకటేష్ పాల్గొన్నారు.



ఎదుగుదల లేని పామాయిల్

జన్నారం: గోదావరి దాటికి పత్తి, వరి పంటలతో పాటుగా పామాయిల్ తోట కూడా నీటిపాలైంది. సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో పది రోజుల పాటుగా కురిసిన వర్షాలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లు ఎత్తివేయడంతో గోదావరి ఉప్పొంగి పంటల్లో నీరు చేరాయి. జన్నారం మండలం కలమడుగులో గడ్డి విష్ణుమూర్తి అనే రైతు 6 ఎకరాల్లో వేసుకున్న పామాయిల్ తోటలో కూడా నీరు చేరింది. పది రోజులుగా నీటిలోనే మొక్కలు ఉండటంతో పెరుగుదల కష్టమేనని రైతు ఆందోళన చెందుతున్నాడు. పెట్టిన పెట్టుబడి నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు సందర్శించి సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

- అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కరుణకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కరుణకుమారి

పాత మంచిర్యాల: అంగన్‌వాడీల వేతనాలు రూ.18 వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని. ఇతర హామీలు అమలు చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(ఏఐటీయూసీ అనుబంధ) రాష్ట్ర కార్యదర్శి కరుణకుమారి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం అంగన్‌వాడీ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణకుమారి మాట్లాడుతూ, గత ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా ఇబ్బంది పెట్టిందన్నారు. 24 రోజులు సమ్మె చేసినా పట్టించుకోలేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్‌కు రూ.10 లక్షలు హెల్పర్లకు రూ.5 లక్షలు చెల్లించాలని, ప్రస్తుతం టీచర్‌కు రూ.లక్ష, హెల్పర్లకు కేవలం రూ.50 వేలు మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం విడుదల చేసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కు సంబంధించిన జీవో 10 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలను ప్రభుత్వం ఉద్యోగులుగా పరిగణిస్తుండడంతో సంక్షేమపథకాలు పొందలేకపోతున్నారని తెలిపారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఖలీందర్ అలీఖాన్, అధ్యక్షురాలిగా భూపతి రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సురేఖ, ఉపాధ్యక్షులుగా అపర్ణ, ఇందిర, శంకరమ్మ, పద్మావతి, సంధ్య, ప్రధాన కార్యదర్శిగా తోకల సరస్వతి, సహయ కార్యదర్శులుగా రాజమణి, శారద, ఐత అరుణ, శైలజ, అరుణ, కోశాధికారిగా కుసుమ, కౌన్సిల్ సభ్యులుగా 33 మంది, కార్యవర్గ సభ్యులుగా 15 మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఖలీందర్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలి

బెల్లంపల్లి: ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హా మీలను రాష్ట్రప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణ, రంజిత్ కుమార్ అన్నారు. బెల్లంపల్లిలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్లో ఆదివారం సీఐటీయూ బెల్లంపల్లి మండల ద్వితీయ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. అనంతరం సీఐటీయూ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా సీ.హెచ్.దేవదాస్, సభ్యులు అనురాధ, భాగ్యలక్ష్మి, లక్ష్మీనారాయణ, స్వాతి, రవీందర్, నాగరాజు, సుమన్, రమేశ్, విశ్వనాథ్‌లను ఎన్నుకున్నారు.

చెత్త తొలగించరూ..!



చెన్నూర్: పట్టణంలోని పెద్ద చెరువు బట్టిగూడెం కాలనీ సమీపంలో గల బతుకమ్మ నిమజ్జన ఘాట్ ప్రాంతం చెత్త చెదారంతో పేరుకుపోయి డంపింగ్ యార్డును తలపిస్తోంది. వేలాది మంది జీవనం సాగిస్తున్న బట్టిగూడెం కాలనీవాసులు నిమజ్జన ఘాట్ ప్రాంతంలో చెరువులో బట్టలు ఉతుక్కుంటారు. ఆ ప్రాంతం అంతా చెత్తతో నిండిపోవడంతో పందులు స్వైర విహా రం చేయడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

బంద్ విజయవంతం చేయండి

భీమారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈ నెల 18న తెలంగాణ వ్యాప్త బంద్‌లో భాగంగా భీమారం మండలంలో కూడా బంద్ పాటించాలని బీసీసంఘాల ప్రతినిధులు ప్రజలను కోరారు. ప్రతి ఒక్కరూ బంద్‌కు సహకరించాలని, బీసీలకు జరుగుతున్న అన్యాయంపై మద్దతు తెలుపాలన్నా రు.

ఓట్ చోరీపై విస్తృత ప్రచారం చేయాలి



ఓట్ చోరీ కరపత్రాలను ప్రదర్శిస్తున్న మంత్రి

చెన్నూర్: కేంద్రంలో అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ చేస్తున్న ఓట్ చోరీ అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. క్యాంప్ కార్యాలయంలో చెన్నూర్, కోటపల్లి మండలాల కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఓట్ చోరీ కరపత్రాలు ప్రదర్శించారు. ఓట్ చోరీతో బీజేపీ ప్రభుత్వం ప్రజలను వంచిస్తోందన్నారు. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఈ అంశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు పీసీసీ పిలుపులో భాగంగా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి బీజేపీ చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు.